నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 98 | బుధవారం, 09 సెప్టెంబర్ 2026 | పేజీలు -4 | వెల : 3/-




# స్పీకర్‌కు రేవంత్, భట్టి పరామర్శ

- నిన్నటి పరిణామాలపై విచారం..
- ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

**వాస్తవ తెలంగాణ** అసెంబ్లీ ఆవరణలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను పరామర్శించారు. స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన వారు జరిగిన ఘటనలపై విచారం వ్యక్తం చేశారు. సోమవారం సభా ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు అధికారులపై దాడులకు పాల్పడ్డారని, మహిళా అధికారులతో అనుచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపించాయి. స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నాయి. ఈ ఘటనలకు సంబంధించిన దృశ్యాలను చూసి సీఎం ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపాయి. శాసన సభ వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ప్రాంగణంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని సీఎం పేర్కొన్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. స్పీకర్‌ను ఓదార్చిన రేవంత్‌రెడ్డి.. ఈ





విషయంలో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనలకు బాధ్యులైన వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపాయి. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా స్పీకర్‌ను పరామర్శించి, జరిగిన పరిణామాలపై విచారం వ్యక్తం చేశారు.

## బాధ్యతగా ప్రజాసేవ చేస్తా



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్‌గా గద్వాల్ విజయలక్ష్మి సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆమె సీఎం ప్రజావాణి హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో, తెలంగాణలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ పదవిని మహిళకు ఇవ్వలేదని చెప్పారు. తొలిసారిగా మహిళకు బాధ్యత అప్పగించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఇది రాష్ట్రంలోని మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు లభించిన గుర్తింపు అని చెప్పారు. పరిపాలనలో నిర్ణయాలు తీసుకునే స్థాయిలోనూ మహిళలకు మరిన్ని అవకాశాలు రావాలనే బలమైన సందేశాన్ని ఈ నియామకం ఇస్తోందన్నారు. మూడు కీలకమైన పదవుల్లో బీసీ మహిళలకు అవకాశం కల్పించడం మహిళా సాధికారతకు, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ పదవిని గౌరవంగా కాకుండా బాధ్యతగా భావించి ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తానని ప్రకటించారు.



# అసెంబ్లీలో స్పీకర్ ఆవేదన

## బీఆర్ఎస్‌పై మంత్రుల ఆగ్రహం

- తాతా మధుపై చర్యలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే పట్టు
- సస్పెన్షన్ కోరుతూ తీర్మానం చేయాలని నిర్ణయం

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేయగా.. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యక్రమాలు సజావుగా సాగాల్సిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా కలచివేశాయని స్పీకర్ పేర్కొన్నారు. శాసనసభ గౌరవం, ప్రజాస్వా మ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత సభ్యులందరిపైనా ఉందని స్పష్టం చేసినట్లు సమాచారం. వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు, సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్, వాస్తవ తెలంగాణ



### హరీశ్ రావు సారీ చెబుతారని అనుకున్నా.. స్పీకర్

శాసనసభను తాను ఎల్లప్పుడూ అత్యంత ప్రజాస్వామ్యయుతంగా నడిపించానని, అయితే శాసనసభాపతి స్థానాన్ని అవమానించిన ఘటనపై సభలో మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు క్షమాపణ చెబుతారని భావిస్తే, ఆయన అసలు విషయాన్ని పక్కదారి పట్టించేలా (డైవర్షన్) మాట్లాడారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులను చూడలేదని, ఈ ఘటనతో రాష్ట్రమంతా అట్టుడుకుతోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ వ్యవహరించినట్లుగా తాము నియంతృత్వంగా వ్యవహరించలేదని, విపక్ష సభ్యులపై వెంటనే అనర్హత వేటు కూడా వేయలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ మహిళా సభ్యులపై జరిగిన ఘటన ఆరోపణలను కూడా నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే అసెంబ్లీ వద్ద కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డిలు పోలీసులపై భౌతిక దాడికి దిగినట్లు స్పష్టంగా కనిపించిందని తెలిపారు. తమ ప్రభుత్వం కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధించలేదని, 2014లో కేసీఆర్ హయాంలో రూపొందించిన అసెంబ్లీ నిబంధనలనే తాము అమలు చేస్తున్నామని, టీషర్టులపై నినాదాలు ఉండటం వల్లే వాటిని సభలోకి అనుమతించలేదని స్పీకర్ స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ తీరుపై మంత్రుల ఆగ్రహం

స్పీకర్ పట్ల బీఆర్ఎస్ నేతలు వ్యవహరించిన తీరుపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతిని అవమానించేలా వ్యవహరించడం శాసనసభ గౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ సభా మర్యాదలను పాటించాలని సూచించారు.

### 'వీళ్లకు తల్లులు లేరా?'.. బీఆర్ఎస్ నేతల తీరుపై మంత్రి సీతక్క ఫైర్

స్పీకర్‌ను దూషించిన వారిని సభ నుంచి బహిష్కరించాలని మంత్రి సీతక్క శాసన మండలిలో డిమాండ్ చేశారు. మంగళవారం శాసన మండలి సమావేశాల్లో ఆమె మాట్లాడారు. మహిళా పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అసభ్యంగా చేతులు వేసి నెట్టి వేశారని మండిపడ్డారు. మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తే.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన, దళిత వ్యతిరేక నైజం మీది బీఆర్ఎస్‌దని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాలు ఎదిగితే ఓర్చుకోలేని భూస్వామ్య విధానం బీఆర్ఎస్‌దన్నారు. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టి రాజకీయం ఎందుకు చేస్తున్నారని విమర్శించా రు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, సభలో మెజార్టీ కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ, స్పీకర్ పై అనుచితంగా మాట్లాడిన తాతా మధు ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించాలని కోరారు. ఈమేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి మండలి చైర్మన్ కు పంపాలని ప్రతిపాదించారు. దీనిపై స్పీకర్ మాట్లాడుతూ, న్యాయకోవిదులతో మాట్లాడి నిర్ణయం తీసుకుందామని అన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి దారుణం



**హుస్నాబాద్ :వాస్తవ తెలంగాణ న్యూస్** మహిళా ప్రజాప్రతినిధులను కూడా గౌరవించరా --- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ గారు తీవ్ర ఆగ్రహం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో భారీ ధర్నా -- అనంతరం నిరసన ర్యాలీ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళా నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తుంటే వారిని పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ గారు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, గారి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు.''అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన జరగడం తెలంగాణ సమాజం సిగ్గుపడే విషయం. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులతో ఇలా వ్యవహరించడం ఏ విధమైన మహిళా గౌరవం?" అని సతీష్ కుమార్ గారు ప్రశ్నించారు.మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రతి మహిళా సమాజం స్పందించాలిమహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటన కేవలం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన విషయం కాదని, ప్రజాస్వామ్యాన్ని, మహిళా గౌరవాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమని సతీష్ కుమార్ గారు అన్నారు.ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ, గౌరవం లేకపోతే రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఏ విధంగా భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా మహిళల గొంతుకను కూడా అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ప్రజల్లోకి బీఆర్ఎస్ పోరుబాటకాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టామని సతీష్ కుమార్ గారు తెలిపారు.నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.రైతుల సమస్యలు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, రైతు సంక్షేమం, మహిళలకు ఇచ్చిన హామీలు, యువతకు సంబంధించిన అంశాలు తదితర ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెస్తాం "సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వరుసగా నిర్వహించిన కార్యక్రమాలతో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అయినా ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వరకు, ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదు" అని వొడితల సతీష్ కుమార్ గారు స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలో అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం తప్ప పోలీసులు కాదని వ్యాఖ్యానించారు. "ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం అంటే ప్రజల గొంతును అడ్డుకోవడమే. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. లేదంటే ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది" అని వొడితల సతీష్ కుమార్ హెచ్చరించారు. హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన భారీ ధర్నా అనంతరం చేపట్టిన నిరసన ర్యాలీలో మహిళలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

## అంబేద్కరా...! రాజ్యాంగ పరిరక్షణలో రేవంత్ సర్కార్ కి మంచి బుద్ధిని ప్రసాదించు....

**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, రాజ్యాంగం కల్పించిన ప్రజల హక్కులను కాలరాస్తున్న తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తూ సంక్షేమ పథకాల అమలులో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కు సరైన బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్ నగర్లోని అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ శ్రేణులు వినతి పత్రం అందజేశారు.



**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...**
రేవంత్ సర్కార్ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా ప్రజలకు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీ ల పేరుతో అనేక హామీలను ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు 33 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం, రైతు భరోసా, కౌలు రైతులకు రైతు భరోసా, ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ల పెంపు వంటి అనేక హామీలతో అధికారంలోకి వచ్చినా హామీలను అమలు చేయకుండా, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించకుండా తీవ్ర మనోవేదనకు గురి చేస్తుంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడంతో ప్రజల పక్షాన పోరాడే బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధుల ప్రశ్నలకు అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ తో ఎదురుదాడికి దిగుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను తీవ్ర అవమానానికి గురిచేస్తుంది. ప్రజల సమస్యలపై టిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో బాధ్యత. కానీ ప్రశ్నించే గొంతులను పోలీసులతో అణచి వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెడుతుంది. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న రేవంత్ సర్కార్ కు బాబా సాహెబ్ అంబేద్కర్ మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటున్నాం.అంతకముందు రాజ్యాంగాన్ని పరిరక్షించేలా సీఎం రేవంత్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని బాబా సాహెబ్ అంబేద్కర్ ని స్మరిస్తూ చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ నగర్ వరకు టిఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జరిగిన పరాభవంపై చర్చ

### సబితా ఇంద్రారెడ్డిని కలిసిన శంకర్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** తెలంగాణ అసెంబ్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలకు జరిగిన పరాభవంపై చర్చించేందుకు శంకర్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేశ్వరం శాసనసభ్యురాలు, తెలంగాణ తొలి మహిళా మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి, పి. సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో జరిగిన పరిణామాలపై నాయకులు ఆమెతో చర్చించి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల మనోభావాలను సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాసుదేవ్ కన్నా, మాజీ సర్పంచ్ శ్రీధర్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్, మహలింగపురం సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, కౌన్సిలర్ మహేందర్ రెడ్డితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్




**శంకర్‌వల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో నీ రామంతపురం 7వ వార్డులో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రశాంత్, అశోక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించాలి

### పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అదనపు కలెక్టర్ నగేష్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** వినాయక చవితి సందర్భంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన విగ్రహాలనే ప్రతిష్ఠించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై రూపొందించిన గోడపత్రికలను నగేష్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని తెలిపారు. దీంతో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జలవనరులు, ప్రకృతిని పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల్లో భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సహజంగా నీటిలో కలిసిపోయే మట్టి విగ్రహాలతో పండుగను పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మాధురి, హౌసింగ్ పీడీ మాణిక్యం, మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డి, డీపీఆర్వో రామచంద్రరాజు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల పలుకుబడినే కోరిన కాళోజీ

### కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి డా. గంగాప్రసాద్




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** కాళోజీ నారాయణరావు తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేశారని ముఖ్య వక్త డా. గంగాప్రసాద్ అన్నారు. కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రసార మాధ్యమాలు--ప్రచార సాధనాలు' అంశంపై ఆయన ప్రసంగించారు.డిజిటల్ యుగంలో సమాచారాన్ని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కాళోజీ సామాజిక చైతన్య భావాలను నేటి తరానికి చేరవేయడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమానికి శాఖాధిపతి వామనమూర్తి అధ్యక్షత వహించారు. కాళోజీ ప్రజల భాషలో సరళమైన శైలిలో రచనలు చేసి సమాజాన్ని చైతన్యపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌శర్మ, డా. అరుంధతి, డా. హరిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి



**వాస్తవ తెలంగాణా డైలీ న్యూస్ కంటోన్మెంట్ /.**తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలకు నిరసనగా కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జెబియస్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిని అవమానించేలా ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌ను అవమానించడం అంటే కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, మొత్తం శాసనసభను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. ఒక ఎమ్మెల్సీ స్థాయిలో ఇలాంటి అనుచిత భాషను ఉపయోగించడం సిగ్గుచేటని, తాతా మధును వెంటనే శాసన మండలి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కూడా తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ గారికి సంఘీభావం తెలుపుతూ.. ఎమ్మెల్సీ తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోవాలని శాసన మండలి ఛైర్మన్‌ను, బీఆర్ఎస్ పార్టీ అధిష్టానాన్ని కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్.. దిష్టిబొమ్మ దహనం





**సిద్దిపేట జిల్లా,నంగునూరు మండలం, వాస్తవ తెలంగాణ న్యూస్** నంగునూర్: అసెంబ్లీ స్పీకర్ గారి పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గారు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ గారి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గారి పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్ గారి పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ గారు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్ గారికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ గారు బహుదూర్ రెడ్డి, గారు డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, గారు ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ గారు కుమార్ ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్ గారు, గొట్టం రంగారెడ్డి, గారు తిప్పని రాజేశ్వర్, గారు జీవన్ నాయక్, గారు ప్రభాకర్, గారు చేర్యాల కృష్ణా గారు, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, గారు కాటం. కనకయ్య, గారు వల్లద్రి రవీందర్ రెడ్డి గారు పదిరే శ్యామ్ రెడ్డి, గారు పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి,బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంజీవని ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ



**చేగుంట వాస్తవ తెలంగాణ 08. 09. 2026** చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామ కాలనీలో నూతనంగా వెలసిన శ్రీ సంజీవని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. ఆలయం వద్ద ప్రతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేగుంట ఉప సర్పంచ్ మహ్మద్ రఫీ పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆలయంలో ధూప, దీప, నైవేద్యాల నిర్వహణ కోసం మహ్మద్ రఫీ ప్రతి నెలా రూ.5,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కమిటీ సభ్యులు అభినందించారు.

# కీసర మండల పరిధిలో నిబంధనలు పాటించని క్రషర్స్

## పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చర్యలు తీసుకోవాలి. సిఐటియు

**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ కీసర మండల పరిధిలో ఉన్న స్టోన్ క్రషర్స్ పరిశ్రమల మూలంగా చుట్టుపక్కల ప్రాంతాలు దుమ్ము ధూళితో వాతావరణాన్ని కలుషితం చేసి ప్రజలను అనారోగ్య పాలుచేసి రోగాల బారిన పడి ప్రాణప్రయస్థితిలోకి పరిసర ప్రాంత ప్రజలు నెట్టబడుతున్నారని సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారిక నివేదికల ప్రకారం, కీసర మండల పరిధిలో కాలుష్య బోర్డు పర్మిషన్ ఉన్న క్రషర్లు మరియు రైస్ మిల్లర్ నియమ నిబంధనలు పాటించే విధంగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. క్రషర్స్ మిల్లర్స్ లో పనిచేసే కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలి. క్వారీలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల రికార్డులు పర్యావరణ నిబంధనల ప్రకారం కీసర మండలంలో పర్మిషన్ పొందిన కొన్ని ప్రముఖ పరిశ్రమలు అనుమతులకు సంబంధించి నోటీస్ బోర్డును ఏర్పాటు చేయాలి. రైస్ మిల్లర్స్ ఆగ్రో పరిశ్రమలు కీసర మండలంలోని బోగారం స్టోన్ క్రషర్లు మరియు మైనింగ్లు కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి, బోగారం మరియు కీసర పరిసర గ్రామాల్లోని సర్వే నంబర్లలో కొన్ని స్టోన్ క్రషర్లు మరియు క్వారీ యూనిట్లకు అంకిరెడ్డిపల్లిలోని యూనిట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ( పి సి బి) నుండి అనుమతులు ఉన్నాయా అనేది అనుమానం. పొల్యూషన్ బోర్డ్ నిబంధనల ప్రకారం క్రషర్ల సామర్థ్యం 200 టి పి హెచ్ లోపు లేదా అంతకంటే ఎక్కువగా ఉండాలి. దాని ఆధారంగనే ఖచ్చితంగా డస్ట్ ఎక్స్‌ట్రాక్షన్ సిస్టమ్స్, బ్యాగ్ ఫిల్టర్లు మరియు క్లోజ్డ్ షెడ్స్ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి .. సరైన పర్మిషన్లు క్యాన్సెంట్ ఫర్ ఆపరేషన్ లేని మరియు కాలుష్య నిబంధనలు పాటించని పలు క్రషర్లపై పొల్యూషన్



బోర్డు అప్పుడప్పుడు క్లోజర్ ఆర్డర్లు జారీ చేస్తూ ఉన్నారు . కానీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. కీసర మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, బోగారం,ఛీర్యాల గ్రామం మరియు దాని పరిసర ప్రాంతాలలో కాలుష్య నియంత్రణ మండలి (టి జి పి సి బి) అనుమతుల కాల పరిమితులు పూర్తయిన వాటిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి. క్వారీలు, స్టోన్ క్రషర్లు మరియు రెడీ మిక్స్ కాంక్రీట్ (అర్ ఎం సి) ప్లాంట్లు , క్రషర్లు , మైనింగ్ యూనిట్లకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నుండి( జఖీజు) మరియు( జఖీూ)అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.కాలుష్య నియంత్రణ, నిబంధనలు పాటించకపోవడం మూలంగా క్రషర్ల వల్ల వచ్చే దుమ్ము ,ధూళి, మరియు శబ్ద కాలుష్యంపై గతంలో స్థానికుల నుండి అనేక ఫిర్యాదులు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఇక్కడి క్రషర్లు ప్లాంట్లు విధిగా కాలుష్య నియంత్రణ చర్యలు (వాటర్ స్ప్రింక్లర్స్ బౌండరీ వాల్స్ మరియు గ్రీన్ బెల్ట్ పెంపకం) చేపట్టాల్సి ఉంటుంది. స్టోన్ క్రషర్ ( అర్ ఎం సి)ప్లాంట్ ఛీర్యాల, తిమ్మాయిపల్లి, యాదగరిపల్లి మరియు అంకిరెడ్డిపల్లి గ్రామాల ఒకే మైనింగ్ క్వారీ జోన్‌గా (కీసర – మైనింగ్ క్లస్టర్) విస్తరించి ఉన్నాయి.మైనింగ్ క్లస్టర్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మరియు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నివేదికల ప్రకారం, కీసర మండలంలోని ఈ ప్రధాన మైనింగ్ జోన్ పరిధిలో సుమారు 17 కి పైగా రిజిస్టర్డ్ స్టోన్ క్రషర్ యూనిట్లు మరియు 31 కి పైగా క్వారీలు నిర్వహిస్తున్న యజమాన్యాలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచనల మేరకు లోబడి తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించని క్రషర్స్ ,క్వారీలు మరియు ఆర్ఎంసిలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పరిసర ప్రాంత బాధిత ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని సిఐటియు కీసర మండల కమిటీ హెచ్చరిస్తుంది.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా.. పోలీసులపై దాడులా..?

## బీఆర్ఎస్ తీరుపై భగ్గు మన్న కాంగ్రెస్ నాయకులు ..

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, టాటా మధు దిష్టిబొమ్మల దహనం

## జగద్గిరిగుట్టలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన.. ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని డిమాండ్





**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎన్ ప్రజాప్రతినిధులు నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి హాజరయ్యే క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులపై దాడులకు పాల్పడటం, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత పదజాలంతో వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకుల తీరును కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఈ మేరకు మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్టలోని భూదేవి హిల్స్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, టాటా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపణ**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నల్లచొక్కాలు ధరించి వచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకున్న సమయంలో వాగ్వాదం చోటుచేసుకుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు బీఆర్ఎస్ నాయకులు పోలీసు సిబ్బందిపై భౌతికంగా దాడులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. అదేవిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ పదవిని కించపరిచేలా వ్యవహరించడం తగదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ సభా మర్యాదలు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

**మహేష్‌కుమార్, కవ్వంపల్లి ఆదేశాలతో**

పీసీసీ, పీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ మహేష్‌కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర వైస్ చైర్మన్, జిల్లా చైర్మన్ కవ్వాలి చంద్రయ్య ఆధ్వర్యంలో దిష్టిబొమ్మల

దహనం చేపట్టారు.కార్యక్రమంలో క్యూబీఆర్ బి–బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షుడు సోల్మన్ రాజు, 280వ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, 295వ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ షరీఫ్, 289బీ డివిజన్ అధ్యక్షుడు గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్‌తో పాటు కౌసల్య, మాధవి రెడ్డి, లలిత, యువరాజ్, సోమేష్, రాహేష్, ధనుష్, భూని, సన్నీ, మనీష్ తదితరులు పాల్గొని నిరసన తెలిపారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఎస్. గంగా లక్ష్మీదేవి కి బీజేపీ నాయకుల సన్మానం:



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ: మేడ్చల్ జిల్లా నుండి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఎస్. గంగా లక్ష్మీదేవి ని భారతీయ జనతా పార్టీ దమ్మాయిగూడ డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు తోట నరేష్ పటేల్ , జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాస్ ,జిల్లా కార్యాలయ కార్యదర్శి గాలి సంపత్ యాదవ్ ,సీనియర్ నాయకులు సామల భరత్ రెడ్డి , ఆమెను శాలువాతో సత్కరించి, ఫలాలు అందజేసి అభినందనలు తెలిపారు... విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆమె చేస్తున్న సేవలు అభినందనీయమని నాయకులు కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం ఆమె కృషి, అంకితభావం మరియు సేవలకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ ప్రధాన కార్యదర్శి తడక కృష్ణ ,డివిజన్ ఉపాధ్యక్షులు ధర్మేందర్ గుప్త ,ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి , కమిటీ సభ్యులు బాలయ్య, డివిజన్ కార్యదర్శి సురేందర్ రెడ్డి , ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆనంద్ పాల్గొని ఎస్. గంగా లక్ష్మీదేవి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. భవిష్యత్తులో కూడా ఆమె మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో చిట్టబోయిన సత్యనారాయణకు గురువందనం




**చేగుంట వాస్తవ తెలంగాణ 08.09.2026** చేగుంటకు చెందిన ప్రాథమిక పాఠశాల కర్నాల్ పల్లి ప్రధానోపాధ్యాయులు చిట్టబోయిన సత్యనారాయణ గారు ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ వారి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఈ ఉత్తమ ఉపాధ్యాయ సన్మానం జరిగింది. విద్యా రంగంలో చిట్టబోయిన సత్యనారాయణ గారు చేసిన విశిష్ట సేవలను, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన చూపిన అంకితభావాన్ని గుర్తించి లయన్స్ క్లబ్ ఈ పురస్కారాన్ని అందజేసింది. రవీంద్రభారతి వేదికపై ప్రముఖుల సమక్షంలో ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, మెమెంటోను బహూకరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రజనకు రామచంద్రం గారు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. సత్యనారాయణ గారి లాంటి సమయపాలన,క్రమశిక్షణ, నిబద్ధత గల ఉపాధ్యాయుడిని లయన్స్ క్లబ్ తరఫున సన్మానించుకోవడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట గారి ఆధ్వర్యంలో ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు, ప్రతిభా పురస్కారాలు అందిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రజనకు రామచంద్రం,ప్రధాన కార్యదర్శి నాగరాజు సీనియర్ లయన్ దాసోజు వీరబ్రహ్మం గారు ఉపాధ్యాయులు పట్లోరి యాదగిరి కర్రె సిద్ధిరాములు, చల్లా రామకృష్ణ, పులిరమేష్ ఉపాధ్యాయులు ప్రతినిధులు, విద్యావేత్తలు, ఇతర ముఖ్య నాయకులు మరియు సత్యనారాయణ గారి అభిమానులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు అభినందనలు తెలియజేశారు

# శ్రీ రాధాకృష్ణ ఆలయ అభివృద్ధికి 800 ఎస్ఎఫ్‌టీ రెడ్ గ్రానైట్ విరాళం.. దాత మణిదీప్‌కు నరేష్ కుమార్ కృతజ్ఞతలు



**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సనాతన కృష్ణగిరి పాదాల గుట్టపై ఉన్న శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్ర అభివృద్ధికి భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం రాష్ట్ర సభ్యుడు మణిదీప్ 800 ఎస్ఎఫ్‌టీ రెడ్ గ్రానైట్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన మణిదీప్, హిందూ ధర్మ పరిరక్షణతో పాటు పురాతన ఆలయాల అభివృద్ధికి సేవలు అందించడం ప్రతి హిందువు బాధ్యత అని అన్నారు. చందిప్ప మరకత శివలింగం క్షేత్రం, గుబ్బడి పత్తెపురం కృష్ణగిరి పాదాల గుట్ట అభివృద్ధి కోసం నరేష్ కుమార్ చేస్తున్న సేవలను అభినందిస్తూ, వాటికి తన వంతు సహకారంగా ఈ గ్రానైట్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక రాష్ట్ర కన్వీనర్ అన్న వజ్జుల సూర్యప్రకాశ్ రావు, రాష్ట్ర కో–కన్వీనర్ నిరంజన్ దేశాయ్ అందిస్తున్న ప్రోత్సాహం ధార్మిక కార్యక్రమాలకు మరింత బలాన్నిస్తోందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా అందించిన రెడ్ గ్రానైట్‌ను ఆలయ పరిసర ప్రాంతాల సుందరీకరణకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సేవా సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నాగారం రోడ్డు, యూటర్న్ సమస్యల పై అఖిలపక్ష ఏకాభిప్రాయ తీర్మానం

**ప్రజల భద్రత కోసం యూటర్న్‌లు, పాదచారుల క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలి పలు పార్టీల నాయకులు.**



**వాస్తవ తెలంగాణ** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ సత్యనారాయణ కాలనీ కమిటీ హాల్‌లో నాగారం అఖిలపక్ష నాయకులు సమావేశమై, నాగారం ప్రధాన రహదారిపై నెలకొన్న యూటర్న్ సమస్య, పాదచారులు రోడ్డు దాటేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అఖిలపక్ష నాయకులందరూ ఏకాభిప్రాయానికి వచ్చి, అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు, పాదచారులు రోడ్డు దాటేందుకు సురక్షితమైన క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.యూటర్న్ కోసం ప్రతిపాదించిన ప్రాంతాలు కళ్ల కాంపౌండ్ సమీపంలో, రాఘవేంద్ర హోటల్ సమీపంలో లేదా మార్బుల్ షాప్ వద్ద అనువైన ప్రదేశాన్ని అధికారులు సాంకేతికంగా పరిశీలించి యూటర్న్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు.పాదచారుల కోసం క్రాసింగ్ పాయింట్లు– ఎస్.వి. నగర్‌లోని ాదీ× బ్యాంక్ సమీపంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు మార్గం ఏర్పాటు చేయాలి. నాగారం ప్రభుత్వ పాఠశాల సమీపంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు ప్రత్యేక క్రాసింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి. దమ్మైగూడ వెళ్లే మార్గంలో ప్రజలు రోడ్డు దాటేందుకు జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేసి, అవసరమైన చోట గ్రిల్స్‌లో ఓపెనింగ్ కల్పించాలి.ఈ సమస్యలపై ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రోటోకాల్, నిబంధనల ప్రకారం డీసీపీ, సీపీ అధికారులకు అఖిలపక్ష నాయకుల తరఫున వినతిపత్రాలు అందజేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష నాయకులంతా ఏకతాటిపైకి రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.లి ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయడం అవసరమని నాయకులు స్పష్టం చేశారు. “పార్టీలు వేరైనా... ప్రజా సమస్యపై మా మాట ఒక్కటే. నాగారం ప్రజల భద్రత కోసం అవసరమైన యూటర్న్‌లు, పాదచారుల క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే వరకు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తాం” అని అఖిలపక్ష నాయకులు తెలిపారు.

# అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

## గోదాముల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి అదనపు కలెక్టర్ నగేష్

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** వానాకాలం ధాన్యం సీజన్--2026ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గోదాముల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు తదితర ప్రాంతాల్లో అనువైన స్థలాలను గుర్తించి పరిశీలించాలని ఆర్డీవోలు, తహసీల్దారులను ఆదేశించారు.గోదాముల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. రైతులకు సులభంగా చేరుకునే ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.అక్టోబర్ మొదటి వారంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ధాన్యం నాణ్యత పరీక్షించే పరికరాలు తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. రైతులకు పారదర్శకంగా,వేగంగా ధాన్యం కొనుగోలు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈసమావేశంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌చార్జి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, సివిల్ సప్లై అధికారులు నిత్యానంద, జగదీష్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు, డీసీవో పద్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలి: అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రం

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా లోకాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంబీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనల మేరకు పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు.



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

**మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరుపై ఆగ్రహం**

అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వచ్చిన ప్రజాప్రతినిధులపై నిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని అన్నారు.

**కేసీఆర్‌పై వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్నపల్లి శంకర్, వేముల వీరేశం చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సంబంధిత ఎమ్మెల్యేలపై సుమోటోగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయిఈ మేరకు సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు

**రోడ్డుపై బైఠాయించి నిరసననాయకుల అరెస్ట్**

అనంతరం బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారుఆరు గ్యారంటీలు అమలు చేయాలి420 హామీలు నెరవేర్చాలికాంగ్రెస్ ప్రభుత్వం డౌన్ డౌన్‌అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చింతా సాయినాథ్ మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారుఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ద్వారా ఉద్యమాలను అణచివేయలేరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారుప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించినందుకు అరెస్టులు చేయడం కాదు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారుఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, హకీమ్, విజేందర్ రెడ్డి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింతా సాయినాథ్ మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరినాగరాజు గౌడ్, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డివాజిత్ వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సదాశివపేట మండల విద్యాధికారికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంఉపాధ్యాయ దినోత్సవాన్నిపురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 320ఐ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవం Vision to Lead గురువందనం ఘనంగా జరిగిందిఈ కార్యక్రమంలో సదాశివపేట మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు పురస్కారాలు అందుకున్నారు సదాశివపేట మండల విద్యాధికారి శంకర్ పాటు,నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నవనీత, కేజీబీవీ ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ ఈ పురస్కారాలను లైన్స్ క్లబ్ సభ్యులు లయన్ బాబురావు ఎ. అమరనాథ్ రావుడవిజయలక్ష్మి,బసవేశ్వరరావు తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు పురస్కార గ్రహీతలకు ప్రజా ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794

# హైదరాబాద్‌కు వెళ్లకుండా ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్న శంకర్‌పల్లి పోలీసులు



**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** ఆశా వర్కర్ల సంఘం పిలుపునిచ్చిన "చలో హైదరాబాద్" కార్యక్రమానికి వెళ్లకుండా శంకర్‌పల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లను మంగళవారం ఉదయం శంకర్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమవుతుండగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆశా వర్కర్లు తమ ప్రధాన డిమాండ్లలో భాగంగా నెలకు రూ.18,000 వేతనం ప్రకటించాలని, ఆరు నెలల పీఆర్సీ పీరియడ్స్‌కు సంబంధించిన బకాయిలు, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల విధులు తదితర పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌సీడీ ఆన్‌లైన్ విధానం, స్కూటమ్ డబ్బాల అమలు నిలిపివేయాలని, ఏఎన్‌సీ, పీఎన్‌సీ తదితర లక్ష్యాలను రద్దు చేయాలని కోరారు. ఆదివారాలు, పండుగ రోజుల్లో సెలవులు కల్పించడంతో పాటు సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా రూ.50 లక్షల బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం ఉద్యోగాల్లో ఆశా వర్కర్లకు ప్రమోషన్ల అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆగస్టు 14న హైదరాబాద్‌లో ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్న అన్ని డిమాండ్లను పరిష్కరించాలని ఆశా వర్కర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనతో శంకర్‌పల్లి ప్రాంతంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# పేరుకే సింగూర్ ప్రాజెక్ట్ కానీ సింగూర్ గ్రామస్తులకు మిషన్ భగీరథ మంజీరా తాగునీటి సరఫరాలో అంతరాయం

## పెద్దారెడ్డిపేట, సింగూర్ గ్రామ ప్రజలు ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేసినా గ్రామస్తులు

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూర్ పెద్దారెడ్డిపేట గ్రామాలకు మంచినీటి సరఫరా లేక రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పేరుకే సింగూర్ ప్రాజెక్ట్ కానీ సింగూర్ గ్రామస్తులకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కోవడం దురదృష్టకారం, సింగూర్ ప్రాజెక్ట్ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నుండి వివిధ మండలాలకు జిల్లాలకు సరఫరా చేస్తున్న మంజీరా నీరు సమీపంలో ఉన్న సింగూర్ మరియు పెద్దారెడ్డిపేట గ్రామంనికి తాగునీటి సరఫరా చేయలేకపోవడం గమనర్హం, మిషన్ భగీరథ పథకం ద్వారా అందుతున్న మంజీరా తాగునీటి సరఫరాను ప్రస్తుతం ఉన్న విధంగానే కొనసాగించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామాల తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ మెయిన్ లైన్ నుండి పైప్ లైన్ కనెక్షన్ ఉందని, దీని ద్వారా ఇప్పటివరకు ఎలాంటి తాగునీటి సమస్య



లేకుండా సరిపడా నీరు అందుతోందని తెలిపారు. అయితే ఇటీవల అధికారులు ఈ మెయిన్ లైన్ కనెక్షన్ ను సెపరేట్ చేసి వేరే పద్ధతిలో పంపింగ్ చేయాలని చూస్తున్నారని, దీనివల్ల నీటి ప్రెజర్ తగ్గి మా గ్రామాలకు వచ్చే నీటి పరిమాణం బాగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రాబోయే రోజుల్లో రెండు గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, కావున అధికారులు స్పందించి ప్రస్తుతం ఉన్న పాత కనెక్షన్ విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా ఇలాగే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మార్వో ను కలసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్వో స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకొని మంచినీటి సరఫరా కు ఎలాంటి ఆటంకలు కలవకుండా చూస్తానని హామీ ఇచ్చారు అని గ్రామ ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దారెడ్డిపేట మరియు సింగూర్ గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హరీష్‌రావు అరెస్ట్‌తో జవహర్‌నగర్‌లో ఉద్రిక్తత..

## ---ఎస్ఓటీ స్టేషన్ వద్ద భారీగా బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన..



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ హరీష్‌రావును జవహర్‌నగర్ ఎస్ఓటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్న సమాచారంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జవహర్ నాగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఆందోళనకు దిగారు.

హరీష్‌రావు అరెస్ట్‌తో జవహర్‌నగర్‌లోని ఎస్ఓటీ పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హకీంపేట వద్ద పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్‌లను వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించినా క్రమం లో హరీష్‌రావును జవహర్‌నగర్ ఎస్ఓటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్నా బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకొన్నారు. పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ గేట్లను నెట్టుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు బి అర్ ఎస్ పార్టీ నాయకులను అడ్డుకున్నారు.అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ఎస్ఓటీ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేసినట్లు సమాచారం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీస్ స్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనకారులను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో జవహర్‌నగర్ ఎస్ఓటీ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# దుండిగల్ పెద్ద చెరువు, బరంపేట పెద్ద చెరువుల పరిశీలన




**దుండిగల్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్, మంగళవారం దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ పెద్ద చెరువు, బరంపేట పెద్ద చెరువులను సందర్శించి, గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. నిర్ణీత గడువులోగా అన్ని ఏర్పాట్లను సక్రమంగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రేన్ల ఏర్పాటు, లైటింగ్, బారికేడింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, చావీజ లక్ష్మయ్య మరియు సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో అక్క మహాదేవి మందిరంలో ప్రత్యేక పూజలు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట: తెలంగాణ రాష్ట్రంలో సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన చారిత్రాత్మక అక్క మహాదేవి మందిరంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను సదాశివపేట వీరశైవ లింగాయత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గంధిగా రాజు మాట్లాడుతూ వైరాగ్యానికి ప్రతీక అక్కమహాదేవివీరశైవ లింగాయత సంప్రదాయంలో అక్కమహాదేవి ఒక మహోన్నత ఆధ్యాత్మిక సాధ్విగా భక్తి వైరాగ్యానికి ప్రతీకగా నిలిచారని పలువురు పేర్కొన్నారు. 12వ శతాబ్దానికి చెందిన అక్కమహాదేవి చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తూ పరమశివుడైనచెన్నమల్లికార్జునుడిని తన ఆరాధ్య దైవంగా భావించారు. భౌతిక బంధాలు ప్రాపంచిక సుఖాలను త్యజించి, ఆత్మజ్ఞానం మరియు శివభక్తి మార్గంలో నడిచారు అన్నారుసంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు అనిమిశెట్టి అన్నపూర్ణ మాట్లాడుతూ అక్కమహాదేవి తన వచనాల ద్వారా భక్తి, జ్ఞానంవైరాగ్యం స్త్రీ స్వాతంత్ర్యం, ఆత్మగౌరవం వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారు. ఆమె జీవితం మహిళలకు ఆధ్యాత్మిక ధైర్యానికి, ఆత్మవిశ్వాసానికి, సమాజంలోని అనవసర బంధాలను అధిగమించే స్ఫూర్తికి ఆదర్శంగా నిలిచింది. అక్కమహాదేవి జీవితం నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని భక్తి, త్యాగం, ధైర్యం, ఆత్మజ్ఞానం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారుఈ సందర్భంగా అక్క మహాదేవి అమ్మవారి విగ్రహానికి పవిత్ర అభిషేకం నిర్వహించి, బిల్వపత్రి, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అక్క మహాదేవి అమ్మవారి ఆశీస్సులు పొందారుఈ కార్యక్రమంలో కవిత, సంధ్య, మహేశ్వరిసావిత్రి,రమ,స్వాతి,పల్లవిఅర్చన,నర్మదా,సవిత,మంజునాగమణి,లలిత, అరుణసమంతఅనురాధ,అన్నమ్మ,నాగరాణిమల్లమ్మ,పద్మ,అనురాధ,సుధారాణి, ఇందిరా, స్వరూప, శ్రీదేవి, అనూష, సాధన, నిర్మల, విద్య తదితరులు పాల్గొన్నారు

# ప్రతి రైతు తప్పనిసరి రైతు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలి



**(వాస్తవ తెలంగాణ టేక్మాల్ మండలం.కాదులూరు )** ఏవో రాంప్రసాద్, గ్రామ సర్పంచ్ సిద్ధు, దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డును గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని టేక్మాల్ మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ,అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు వివరించారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని, ముఖ్యంగా పీఎం కిసాన్ పథకము తదుపరి విడుదల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయినా రైతు భరోసా, రుణమాఫీ,పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా, ఇతర ఎరువుల బుకింగ్ యాప్ కోరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డు,భూ యాజమాన్య పాస్ బుక్, ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ తో మీ క్లస్టర్ పరిధిలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

# పుస్తక పఠనంతో మనోవికాసం డాక్టర్ పెంటా గౌడ్



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** విద్యార్థుల మనోవికాసంలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని పట్టణ వైద్యుడు డాక్టర్ పెంటా గౌడ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ తదితర సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను వితరణ చేశారు. మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతిరాజు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెంటా గౌడ్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి పెంపొందుతాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పుస్తకాలు కొనుగోలు చేయలేని నిరుపేద విద్యార్థులకు తనవంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, జంతుశాస్త్ర అధ్యాపకుడు వినోద్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం ముందడుగు వేసిన రామప్రభు



మియాపూర్, సెప్టెంబర్ 8 (వాస్తవ తెలంగాణ): సమస్య కనిపిస్తే వెనక్కి తగ్గకుండా, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోకుండా, పరిష్కారం కోసం ముందుండి పోరాడే నాయకత్వమే అట్టేపల్లి రామప్రభు గారి ప్రత్యేకత అని స్థానికులు పేర్కొంటున్నారు.ఖీజ×, ుచీ నగర్, వైడియా కాలనీ ప్రాంతాల్లో పర్యటించిన అట్టేపల్లి రామప్రభు గారు అక్కడి రోడ్ల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. రోడ్లు సరిగా లేక కాలనీ ప్రజలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను చూసి కేవలం హామీ ఇచ్చి వెళ్లిపోవడం తన విధానం కాదని, "ప్రజలు ఇబ్బంది పడుతుంటే పరిష్కారం చూపించాల్సిందే" అనే సంకల్పంతో వెంటనే స్పందించారు. మోరం తీసుకువచ్చి రోడ్లపై వేయించి, రోడ్లను చదును చేయించే చర్యలు చేపట్టారు. ఇది ఒక చిన్న సమస్యకు చేసిన తాత్కాలిక సహాయం మాత్రమే కాకుండా, ప్రజల పట్ల ఉన్న బాధ్యతను చేతల్లో చూపించిన నాయకత్వానికి నిదర్శనమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రజల సమస్యలపై ప్రశ్నించడంలోనూ... ప్రజల కోసం ముందుకు రావడంలోనూ...అవసరమైన చోట చొరవ తీసుకోవడంలోనూ... రామప్రభు గారు ఎప్పుడూ ముందుంటారని స్థానికులు చెబుతున్నారు.పదవుల కోసం ప్రజల వద్దకు వెళ్లే నాయకత్వం కాదు... ప్రజల కోసం అవసరమైనప్పుడు ముందుకు వచ్చే నాయకత్వం."ప్రజల సమస్య కనిపిస్తే స్పందన కాదు... పరిష్కారం కావాలి." "మాట ఇచ్చిన చోట ఆగరు... పని పూర్తయ్యే వరకు ముందుకు సాగుతారు." అట్టేపల్లి రామప్రభు

## కుషాయిగూడ డివిజన్ బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు గా పాండు ముదిరాజ్ ఎన్నిక



ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ కాప్రా సర్కిల్ బీజేపీ కుషాయిగూడ డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ అధ్యక్షతన సీనియర్ నాయకులు మరియు డివిజన్ కమిటీ మెంబర్లు సమావేశమై కుషాయిగూడ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా చక్రిపురంకు చెందిన గడ్డల పాండు ముదిరాజ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నన్ను ఓబిసి మోర్చా డివిజన్ అధ్యక్షులుగా నియమించినందుకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ కి చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు రైల్వే బోర్డ్ మెంబర్స్ డి. నాదం, ఎం .లక్ష్మణ్ గౌడ్, ఓబీసీ మోర్చా ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ తాళ్ల ఆనంద్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా మాజీ ఉపాధ్యక్షులు రేగొండ వెంకటేశ్వర్లు, కంటెస్ కార్పొరేటర్ కాసుల సురేందర్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు కొమ్ము నర్సింగరావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఇస్లావత్ హరినాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కుషాయిగూడ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గడ్డల పాండు ముదిరాజ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నాపైన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని పార్టీ అప్పగించినా కార్యక్రమాలను, విధి విధానాలను,విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని పాండు ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు ఎన్ జనార్ధన్, లక్ష్మీనారాయణ గౌడ్, సోమసాని అశోక్, ఉమ్మడి చర్లపల్లి డివిజన్ ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షులు పి గణేష్ గౌడ్,ఎస్సీ మోర్చా అధ్యక్షులు బుగ్గ జాంగిర్, ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు సి దయానంద్, సీనియర్ నాయకులు, సహదేవ్గౌడ్ ,పిట్టల రాజు ముదిరాజ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కళావతి ,మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు ఎస్.జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న పై నాగారం రెడ్డి సంఘం కీసర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు..



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ రెడ్డి కమ్యూనిటీ పై అనుచివాక్యలు చేసిన చింత పండు నవీన్ (తీన్మార్ మల్లయ్య పై కీసర పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలని నాగారం రెడ్డి సంఘం నుండి డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. మళ్లీ ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే దానికి సమాధానంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రెడ్డిల ఓట్ల తో (ఎం ఎల్ సి)గా గెలిచిన నువ్వు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం రెడ్డి సంఘం అధ్యక్షులు కొడీమాల కొండల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నేతులు యాదిరెడ్డి ,ప్రధాన కార్యదర్శి వంటేరు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు మామిడి జంగారెడ్డి, కోశాధికారి కంకణాల రాంచంద్రారెడ్డి, మల్రెడ్డీ ,సతీశ్ రెడ్డి ,కంది రంగారెడ్డి ,పన్నాల వినయ్ రెడ్డి పాల్గొన్నారు.

## తూప్రాన్ బీఆరెస్ నాయకుల ఛలో మర్క్యూక్



**తూప్రాన్ ప్రతినిధి సెప్టెంబర్ 08:-** బీఆరెస్ అధిష్టానం పిలుపు మేరకు మెదక్ జిల్లా తూప్రాన్ మనోహరాబాద్ మండలాల నుండి "ఛలో మర్క్యూక్" కార్యక్రమానికి డీసీఎం లలో నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లార ు.అసెంబ్లీ సమావేశాల వేళ బీఆరెస్ ఎమ్మెల్యేలను పోలీసు చర్య ద్వారా అవమానించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో మండల బీఆరెస్ అధ్యక్షులు బాబుల్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవిందర్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్ నాయకులు భాస్కర్ నాయక్, సర్పంచ్ హైమద్,అనిల్, ప్రభాకర్ రెడ్డి, గుడిసె శ్రీహరి మరియు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం

**మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మ శ్రీ టిడిపి నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో**

**రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక, తాంత్రిక పూజా విధానాలపై శిక్షణ**

**మంత్రోపదేశ మహోత్సవంతో ముగిసిన కార్యక్రమం**



**హైదరాబాద్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..** కేరళ సంప్రదాయ తాంక విధానంలో అయ్యప్ప స్వామి పూజా విధానాలను పరిచయం చేయడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక సాధన, పూజా ప్రక్రియలపై ప్రాయోగిక అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న వారు హాజరయ్యారు. గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్ వేదికగా కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సమ్మేళనాన్ని కేరళలోని చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మ శ్రీ టిడిపి నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

**తొలిరోజు ప్రాయోగిక శిక్షణ, అయ్యప్ప సాధన...**

సెప్టెంబర్ 6వ తేదీన మొదటి రోజు కార్యక్రమాల్లో పాల్గొన్న సాధకులకు కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. గురు ఆగమనంతో పాటు గురు వందనం, వివిధ పూజా ప్రక్రియలకు సంబంధించిన ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు విడతలుగా ప్రాయోగిక శిక్షణ కొనసాగింది. మధ్యాహ్నం అనంతరం కూడా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి, అనంతరం అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజను కేరళ తాంత్రిక సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప భజన సంధ్య కార్యక్రమం భక్తి వాతావరణాన్ని నెలకొల్పింది. భజనలు, ఆధ్యాత్మిక సంగీతంతో పాటు పాల్గొన్న భక్తులు, అతిథులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు.

**రెండో రోజు మంత్రోపదేశ మహోత్సవం...**

సెప్టెంబర్ 7వ తేదీన రెండో రోజు కార్యక్రమానికి అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉదయం అల్పాహారం అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తంత్ర గురు బ్రహ్మశ్రీ టీ.డి.పీ. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో అయ్యప్ప మంత్రోపదేశ కార్యక్రమం నిర్వహించారు. మంత్రోపదేశం అనంతరం గురు పాద పూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సాధకులు, ఇతర ప్రముఖులకు జ్ఞాపికలను అందజేశారు.

**గురూజీతో ప్రత్యేక ముఖాముఖి...**

రెండో రోజు సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వారికి గురూజీతో వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం కల్పించారు. ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన సందేహాలు, పూజా విధానాలపై ప్రశ్నలు, ప్రత్యేక సందర్భాల్లో పూజా మార్గదర్శకత్వం, అయ్యప్ప పడి పూజకు సంబంధించిన అంశాలపై మార్గదర్శనం పొందే అవకాశం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

**కేరళ తాంత్రిక సంప్రదాయానికి ప్రత్యేక ప్రాధాన్యం...**

అయ్యప్ప పూజా విధానాలను కేరళ తాంత్రిక సంప్రదాయంలో అధ్యయనం చేయాలనుకునే సాధకులకు ఇలాంటి కార్యక్రమాలు ప్రాయోగిక అవగాహన కల్పించే వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో కేవలం ఉపన్యాసాలకు పరిమితం కాకుండా "నేర్చుకోవడం -- సాధన చేయడం -- అనుభవించడం -- గురు ఆశీస్సులు పొందడం" అనే విధానంలో కార్యక్రమాలను రూపొందించడం ప్రత్యేకతగా నిలిచింది. పూజా విధానాలను ప్రత్యక్షంగా అభ్యసించేందుకు పలు ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించడంతో సాధకులకు మరింత అవగాహన కలిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

## జగద్గిరిగుట్టలో రాబరీ కేసు ఛేదన ముగ్గురు నిందితుల అరెస్ట్..

**బంగారు చెవిదిద్దులు, ప్లాటినం ఉంగరం స్వాధీనం**




జగద్గిరిగుట్ట వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు. జగద్గిరిగుట్ట యెల్లమ్మబండ సిక్కు బస్తీలో ఇద్దరు వ్యక్తులను బెదిరించి, మహిళ వద్ద నుంచి బంగారు చెవిదిద్దులు, ప్లాటినం ఉంగరం దోచుకున్న రాబరీ కేసును జగద్గిరిగుట్ట పోలీసులు ఛేదించారు. ఈ ఘటన సెప్టెంబర్ 6న రాత్రి చోటుచేసుకోగా, బాధితులు కూకట్‌పల్లి నుంచి జీడిమెట్లకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డగించి బెదిరించారు. అనంతరం వారిని రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి, మహిళ ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు.పోలీసులు అందించిన విశ్వసనీయ సమాచారంతో నిందితులు తిలిపిత్య దీపక్ సింగ్ (45), బౌరి రాచన్ సింగ్ (25), బురాని సుర్జిత్ సింగ్ (25)లను అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 4 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవిదిద్దులు, ప్లాటినం ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సెప్టెంబర్ 8న అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. చీకటి పడిన తర్వాత ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బెదిరించి ఆభరణాలు దోచుకోవడం వీరి నేర పద్ధతిగా పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఏ1పై గతంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ ఇంటి దొంగతనం కేసు ఉన్నట్లు వెల్లడించారు. డీసీపీ ఎన్.కోటి రెడ్డి, ఏసీపీ బాలగంగి రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎన్.సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.నరేంద్రరెడ్డి, ఎస్ఐ కె.శ్రీనివాస్, క్రైమ్ సిబ్బంది కేసును ఛేదించారు.

## మహిళలు అని రంగాలలో మరింత ముందుకు వెళ్లాలి

**-ఫోర్ కమిటీ చైర్మన్ చౌటిపల్లి విజయ**

**-ఎమ్మార్పీఎస్ ఎమ్మెమ్మెస్ మహిళా విభాగం సమావేశంలో వెల్లడి**



**తూప్రాన్ వాస్తవ తెలంగాణ ప్రతినిధి(బి.నాగరాజు యాదవ్)సెప్టెంబర్ 08:-** మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం సమావేశం జరిగినట్లు మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ అనుబంధ సంఘాల మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారి ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో మరింత ముందుకు వెళ్లి సమానత్వం సాధించాలని వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఇట్టి కార్యక్రమం ఫోర్ కమిటీ చైర్మన్ విజయ మాదిగ ఎంఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు జేపీ లతా మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మాదిగ మెదక్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తప్పెట పుష్ప మాదిగ హాజరైనట్లు వారి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మహిళలకు తమ స్వావలంబన మన కోసం మరింత ముందుకెళ్లడానికి కావలసిన నైపుణ్యాలను వివరించడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా మండలాలు గ్రామాల నుండి ఇట్టి సమావేశానికి వచ్చి విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ అమరావతి వేదికగా జరగబోయే జాతీయ సమావేశానికి సన్నద్ధం కావాలని సూచిస్తూ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ మహిళా విభాగం జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.